సాక్షి జగిత్యాల

గురువారం । 12 । అక్టోబర్ । 2023



'దళితబంధు'పై మహిళల ఆందోళన

దళితబంధు పథకాన్ని అర్హులకు కాకుండా.. అనర్హులకు అందిస్తున్నారని, ప్రజాప్రతినిధులే చక్రం తిప్పుతున్నారని దళిత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 10లో▸



ఓట్లు అడిగే అర్హత బీఆర్‌ఎస్‌కే ఉంది..

రాష్ట్రంలో ఓట్లు అడిగే అర్హత కేవలం బీఆర్‌ఎస్‌కే ఉందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపెల్లి వినోద్‌కుమార్ అన్నారు. 10లో▸

గరిష్టం/కనిష్టం 34.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై కనిపిస్తుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఎస్పీ భాస్కర్ బదిలీ



భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయన బదిలీ అయ్యారు. భాస్కర్ ఈ ఏడాది జనవరి 28న ఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో ఇంటలిజెన్స్ ఎస్పీగా పనిచేసిన ఆయన జగిత్యాల ఎస్పీగా వచ్చారు. ఏడాది తిరగకముందే ఆయనను బదిలీ చేశారు.

సమస్యలను నివృత్తి చేసుకోవాలి

- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న యాస్మిన్ బాషా

జగిత్యాల: ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, నూతన ఎపిక్ కార్డులు తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుకునేందుకు 1950 కంట్రోల్ రూమ్ ద్వారా సందేహాలు, సమస్యలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో మాట్లాడుతూ ఓటరు నమోదుకు సంబంధించి హెల్ప్‌లైన్ నంబరు 1950 ఏర్పాటు చేశామని, ఇప్పటి వరకు 370 మంది కాల్స్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఈ కాల్ సెంటర్‌లో ప్రత్యేక సిబ్బంది ఉంటారని తెలిపారు.

బీజేపీ జగిత్యాల అభ్యర్థిగా భోగ శ్రావణి



భోగ శ్రావణి

సాక్షిప్రతినిధి, కరీంనగర్: బీజేపీ అసెంబ్లీ స్థానం నుంచి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భోగ శ్రావణి పోటీ చేయనున్నారు. కొన్ని నెలల క్రితం అధికార పార్టీలో విభేదాల కారణంగా పదవికి, పార్టీకి రాజీనామా చేసిన ఆమె బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. వైద్యురాలు, విద్యావంతురాలు, బీసీ సామాజికవర్గానికి చెందిన మహిళ కావడం, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చేసిన అనుభవం ఉండటంతో పార్టీ ఆమెకు టికెట్ ఇచ్చే యోచనలో ఉందని కమలనాథులు చెబుతున్నారు. వాస్తవానికి శ్రావణి చేరిక సమయంలోనే ఆమెకు పార్టీ నుంచి టికెట్ హామీ దక్కిందని ప్రచారం జరిగింది. అధిష్టానం ఆమె పేరును దాదాపుగా ఖరారు చేసిందని సమాచారం.

బాల్య వివాహాలు అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాదులు, ఉపాధ్యాయులు

జగిత్యాలజోన్: బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కట్కం చంద్రమోహన్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు బాల్య వివాహరహిత ప్రచార నేపథ్యంలో బుధవారం జిల్లా ఓల్డ్ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేశారు. ఉన్నత చదువులు చదివిన తర్వాతనే పెళ్లి గురించి ఆలోచనలు చేయాలని సూచించారు. బాల్యవివాహాలు చేయొద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో డిఫెన్స్ లీగల్ ఎయిడ్ న్యాయవాది సతీశ్, న్యాయ సేవ సంస్థ అధికారులు ఎం.వినయ్, మీర్జఫైజల్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డైరెక్టర్‌ను కలిసిన పశువైద్యులు



రాంచందర్‌నాయక్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా పశువైద్యులు

జగిత్యాలఅగ్రికల్చర్: రాష్ట్ర పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ రాంచందర్‌నాయక్‌ను జిల్లా పశువైద్యులు బుధవారం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో పాడి పశువుల సంఖ్య పెంచేందుకు.. పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పశువైద్యులకు సూచించారు.

గేరు మార్చిన కారు

- ప్రగతిభవన్‌కు రావాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు పిలుపు
- 15న అభ్యర్థులకు బీ ఫారాలు అందజేత
- అదేరోజు హుస్నాబాద్ నుంచి సీఎం ఎన్నికల ప్రచారం ప్రారంభం
- ఆదివారం నుంచి గులాబీ పార్టీ ప్రచారం ముమ్మరం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: అసెంబ్లీ ఎన్నికలకు కోడ్ రావడంతో కారు పార్టీ గేరు మార్చింది. నెలరోజుల క్రితమే అభ్యర్థులను ప్రకటించి ప్రత్యర్థులను ఊహించని అయోమయంలో పడేసిన సీఎం కేసీఆర్.. తాజాగా మరో ముందుడుగు వేస్తున్నారు. ఈనెల 15న అభ్యర్థులకు బీఫారాలు అందించనున్నారు. అదేరోజు నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల సమరశంఖం పూరించనున్నారు. అది కూడా ఆయనకు సెంటిమెంట్‌పరంగా కలిసి వచ్చిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే కావడం విశేషం. 15న ఉదయం సిట్టింగులు, కొత్త అభ్యర్థులకు బీ ఫారాలు అందించిన అనంతరం హుస్నాబాద్‌లో జరిగే సభకు హాజరవుతారని సమాచారం. సెప్టెంబరులోనే అభ్యర్థులను ప్రకటించడంతో ఆశావహులంతా వారివారి నియోజకవర్గాల్లో ప్రచారం ప్రారంభించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ పనుల ప్రారంభోత్సవాలు, కొత్త పనులకు శంకుస్థాపనల కార్యక్రమాన్ని వేదికగా చేసుకుని అభివృద్ధి చూసి తమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని, విపక్షాలకు అవకాశం ఇవ్వవద్దని కోరుతున్నారు.

అమావాస్య మరునాడు బీ ఫారాలు

ఇప్పటివరకు ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీ ఒక్క అభ్యర్థిని కూడా ప్రకటించలేదు. ఇదే అదనుగా గతంలో గెలిచిన సీట్ల కంటే అధిక సీట్లు గెలవాలన్న లక్ష్యంతో పావులు కదుపుతున్న కారు పార్టీ ఆదివారం నుంచి ప్రచారాన్ని హోరెత్తించనుంది. శనివారంతో అమావాస్య ముగియనుంది. మరుసటి రోజు నుంచి మరింత ముమ్మరం చేయాలన్న ప్రణాళికతో ముందుకుసాగుతోంది. ఇందులోభాగంగానే హుస్నాబాద్ సభకు జనసమీకరణ కోసం ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్ అభ్యర్థులు ఉదయాన్నే బీ ఫారాలు అందుకుని వెంటనే తిరిగి రావాల్సి ఉంటుంది.

వీరికి బీ ఫారాలు

ఉమ్మడి జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా కల్వకుంట్ల తారకరామారావు, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, రసమయి బాలకిషన్, దాసరి మనోహర్‌రెడ్డి, వొడితెల సతీశ్‌బాబు, కోరుకంటి చందర్, సంజయ్ కుమార్, సుంకె రవిశంకర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, కొత్తగా పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, చలిమెడ లక్ష్మీ నరసింహారావుకు బీ ఫారాలు అందనున్నాయి.

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

ఉమ్మడి జిల్లాలో 13 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. క్లీన్‌స్వీప్ చేయాలని భావించిన ప్రతిసారీ కారుపార్టీకి నిరాశే మిగులుతోంది. 2014లో బీఆర్‌ఎస్ 12 స్థానాలు గెలుచుకుంది. 2018లో 11 స్థానాలు గెలవగా.. ఏఐఎఫ్‌బీ నుంచి గెలిచిన రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ బీఆర్‌ఎస్ తీర్థం పుచ్చుకోవడంతో ఎమ్మెల్యేల సంఖ్య తిరిగి 12కు చేరుకుంది. 2018లో ఈటల రాజేందర్ పార్టీకి రాజీనామా చేయడంతో మళ్లీ 11కు పడిపోయింది. ఈ క్రమంలో ఈసారి ఎలాగైనా 13 స్థానాల్లో పాగా వేయాలన్న పట్టుదలలో ఉంది గులాబీ పార్టీ. ఈ నేపథ్యంలోనే సీఎం కేసీఆర్ ఈనెల 15న హుస్నాబాద్, 17న సిరిసిల్ల, నవంబరు 3న కోరుట్ల, 7న మంథని, పెద్దపల్లిలో భారీ బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ఈ సభలను నిర్వహించడం ఆయా నియోజకవర్గ నాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు.

రూ.25 కోట్లతో అభివృద్ధి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



రాయికల్: ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రాయికల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే రాయికల్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీ అయ్యిందని, రూ.25 కోట్లతో అభివృద్ధి చేశామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మన వార్డు మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి పట్టణంలోని 11, 12, 7, 6, 5, 4 వార్డుల్లో పర్యటించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సీసీరోడ్లు, మురికికాలువలు, డివైడర్లు నిర్మించి సెంట్రల్‌లైటింగ్ ఏర్పాటు చేశామని, వైకుంఠదామం, బస్తీ దవాఖానా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు పార్టీ ఫండ్ కింద మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు రూ.25వేలు, కౌన్సిలర్లు గండ్ర రమాదేవి, తురగ శ్రీధర్‌రెడ్డి, ఎలిగేటి అనిల్‌కుమార్ రూ.పదివేల చొప్పున అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, వైస్ చైర్మన్ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మారంపల్లి రాణి, పట్టణ అధ్యక్షుడు ఇంతియాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లు అర్హులందరికీ వస్తాయి

జగిత్యాల: డబుల్‌బెడ్‌రూంలు ఇళ్లు అర్హులందరికీ వస్తాయని, ఎవరూ అధైర్యపడొద్దని ఎమ్మెల్యే అన్నారు. బుధవారం 13వవార్డుకు చెందిన మైనార్టీలు ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. ఆసీఫ్, ఫిరోజ్, వొల్లం మల్లేశం పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలపై దృష్టి



సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎస్పీ భాస్కర్

- జిల్లాలో 927 పోలింగ్ కేంద్రాలు
- 248 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

జగిత్యాలక్రైం: అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతోంది. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతోపాటు, సాధారణ, సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి వాటిపై నిఘా పటిష్టం చేసింది. జిల్లాలో మొత్తం 927 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. సాధారణ కేంద్రాలు 679గా సమస్యాత్మకంగా 248గా గుర్తించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను నిత్యం ఆయా ప్రాంతాల్లో ఉన్న పోలీసు అధికారులు పరిశీలించడంతోపాటు, అల్లర్లు సృష్టించే వారి కదలికలపై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లాలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసు శాఖ పకడ్బందీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సమస్యాత్మక కేంద్రాలను బుధవారం ఎస్పీ భాస్కర్ పరిశీలించారు.

చెక్‌పోస్టులతో నిఘా..

మెట్‌పల్లిరూరల్/మల్లాపూర్: అసాంఘిక కార్యకలాపాలు, నేరాల నియంత్రణకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ భాస్కర్ తెలిపారు. బుధవారం మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయం వద్ద సరిహద్దు పోలీస్ తనిఖీ కేంద్రాన్ని ప్రారంభించారు. సీసీ కెమెరాలు పరిశీలించి వాహనాలను తనిఖీ చేశారు. ఈ మార్గం మీదుగా వెళ్లే వాహనాలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. రూ.50 వేలకు మించి ఎక్కువ నగదు తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు. మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి ఎస్సైలు ఉమాసాగర్, చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మల్లాపూర్ మండలంలోని జిల్లా సరిహద్దు గ్రామమైన ఒబులాపూర్ బాదనకుర్తి వంతెన సమీపంలో చెక్‌పోస్టును ప్రారంభించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని నాలుగు పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. కేంద్రంలోని వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రచార సభలకు అనుమతి తప్పనిసరి

- కోరుట్ల అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్
- పార్టీల నేతలతో సమావేశం



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్

కోరుట్ల: అభ్యర్థులు నిర్వహించే ప్రచార సభలకు అనుమతి తీసుకోవాలని కోరుట్ల రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఇంటింటి ప్రచారానికి తప్ప మిగిలిన కార్నర్‌మీటింగ్‌లు, ముఖ్య నేతల సభలకు అనుమతి తీసుకోవాలన్నారు. హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఇతరత్రా ఖర్చులను ఎప్పటికప్పుడు పరిగణనలోకి తీసుకుంటామని, ఒకేరోజు రెండు లేదా మూడు పార్టీల సభలు ఉంటే దరఖాస్తు చేసుకున్న వరుస ప్రకారం అనుమతి ఇస్తామన్నారు. మైక్‌లు, వాహనాలు, ప్రచార సభల అనుమతి కోసం ఆన్‌లైన్‌తోపాటు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇళ్ల గోడలపై రాతలకు ఇంటియజమాని, మున్సిపల్ అనుమతి పొందాలని పేర్కొన్నారు. డీఎస్పీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే రశీదులు ఉంచుకోవాలన్నారు. ఆరు బాటిళ్లకు మించి మద్యం దొరికితే సీజ్ చేసి కేసులు పెడతామన్నారు. కోరుట్ల తహసీల్దార్ కిషన్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

మిల్లర్లకు సీఎంఆర్ టార్గెట్

- నవంబర్ 30 వరకు బియ్యం అప్పగించకుంటే చర్యలు
- నోటీసులు జారీ చేసిన అధికారులు



రైస్‌మిల్లులో ధాన్యం

జగిత్యాలరూరల్: ధాన్యాన్ని సేకరించిన ప్రభుత్వం మిల్లర్లకు సీఎంఆర్‌కు అప్పగించింది. ఎఫ్‌సీఐకి సీఎంఆర్ అప్పగించాల్సిన మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. అధికారులు సమావేశాలు నిర్వహించి ఆదేశాలు జారీ చేస్తున్నా మిల్లర్లలో కదలిక రావడం లేదు. 2021–22కు సంబంధించిన ఖరీఫ్ ధాన్యం తాలూకు 3,905 టన్నుల సీఎంఆర్, రబీలో 4,053 సీఎంఆర్‌ను మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. దీంతో మిల్లర్లందరికీ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారు. నవంబర్ 30లోపు ఇవ్వాలని నోటీసులు జారీ చేశారు. బియ్యం అప్పగించని మిల్లర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఈ వానాకాలం ధాన్యాన్ని కేటాయించొద్దని నిర్ణయానికి వచ్చింది. దీనిపై జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావును వివరణ కోరగా.. నవంబర్ 30 వరకు బియ్యం అప్పగించాలని నోటీసులు జారీ చేశామన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. ఎన్నికల శంఖారావానికి బుధవారం ధర్మపురిలో శ్రీకారం చుట్టారు. అనంతరం పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. ఇంటింటికీ ఈశ్వరన్న కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రతిపక్షాలు బీఆర్‌ఎస్‌ను బద్నాం చేస్తున్నాయని విమర్శించారు. పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు మరోసారి పట్టం కడతాయన్నారు. నవంబర్ 2న ధర్మపురిలో సీఎం కేసీఆర్ సభ ఉంటుందని, ప్రతి గ్రామం నుంచి పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి

- మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న అరుణ్‌కుమార్

మెట్‌పల్లి: సమాజంలో జరుగుతున్న నేరాలపై బాలికలకు అవగాహన కల్పించాలని మెట్‌పల్లి మేజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఇందులో మేజిస్ట్రేట్ పాల్గొని పలు సూచనలు చేశారు. సమాజంలో రోజురోజుకూ చిన్నారులపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, వీటి పట్ల వారికి అవగాహన కల్పించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. నేరాలపై అవగాహన కలిగి ఉంటే వాటి బారిన పడకుండా తమను తాము సంరక్షించుకునే అవకాశముంటుందన్నారు. బాల్య వివాహాలతో చిన్నారుల జీవితాలు దెబ్బతింటాయని, వీటి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

వైద్యం వ్యాపారం..

- నిబంధనలు హుష్‌కాకి
- రోగుల నుంచి ఇష్టారాజ్యంగా వసూళ్లు
- ఇరుకు గదుల్లోనే నిర్వహణ
- ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాకం
- పట్టించుకోని వైద్యాధికారులు



అశోక్‌నగర్‌లో ప్రైవేటు ఆస్పత్రులు



రోడ్లపైనే పార్కింగ్..

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో ఇటీవల ఓ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి డాక్టర్లను తీసుకువచ్చి మల్టీస్పెషాలిటీ పేరుతో ఆస్పత్రి ఏర్పాటు చేసి రోగుల నుంచి అందినంతా దోచేస్తున్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా జన్నారం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు జ్వరం వచ్చిందని ఆ ఆస్పత్రికి వచ్చాడు. చికిత్స పొందుతూనే మృతిచెందాడు. అయితే అతడి బంధువులతో మాట్లాడి శవాన్ని గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రి నుంచి పంపించేశారు.

ఇటీవల మెట్‌పల్లి ప్రాంతంలో ఓ ఆర్‌ఎంపీ అర్హుడైన డాక్టర్ పేరున ఆస్పత్రి నెలకొల్పి అతనే చికిత్స చేశాడు. ప్రజల నుంచి అందినంతా దోచుకోవడంతో పాటు, ఆపరేషన్లు సైతం చేయడం గమనార్హం. ఈ విషయం వైద్యాధికారులకు తెలియడంతో వెంటనే ఆ ఆస్పత్రిని సీజ్ చేశారు. జిల్లా కేంద్రం కావడంతో ఇటీవల కార్పొరేట్ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నామంటూ ఫ్లెక్సీలు, కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తూ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. చిన్నచిన్న గదుల్లో ఎక్కపడితే అక్కడ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నా వైద్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. జిల్లాలో వైద్యం వ్యాపారంగా మారింది. కార్పొరేట్‌స్థాయి అని చెబుతూ ఆ స్థాయిలోనే పేద ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. కనీస నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో సుమారు 170 వరకు ఆస్పత్రులు ఉన్నాయి. వాటిలో కనీస నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. రోగులకు కూడా సరైన వైద్యం అందడం లేదని, ఫీజు వసూళ్లలో మాత్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. జిల్లా వైద్యాశాఖ అధికారులు నిబంధనలు పాటించని ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడం లేదు. జిల్లాలో ఇటీవల కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు ఇరుకైన గదులు ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నారు. మెట్లు లేకపోవడం, రోగులు పైకి వెళ్లడానికి చిన్నచిన్న ర్యాంపులు లేని భవనాల్లోనూ ఏర్పాటు చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగినా పట్టించుకునే నాథుడే లేడు.

ఇవీ నిబంధనలు

- నర్సింగ్‌హోంలు, ఐసీయూలు ఉంటే సరిపడా బెడ్లు ఉండాలి.
- ఫైర్‌సేఫ్టీ తప్పనిసరి.
- ఆస్పత్రి భవనంపై నిర్ణీత సామర్థ్యం గల నీటి ట్యాంకులతోపాటు పైప్‌లైన్ వార్డులు, గదులకు ఉండాలి.
- ఆస్పత్రి చుట్టూ అగ్నిమాపక యంత్రం తిరిగేలా అనువైన స్థలం ఉండాలి.



రోడ్ల పక్కనే ఆస్పత్రి జనరేటర్లు

- నర్సింగ్‌హోంలలో ప్రసవాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఫైర్‌సేఫ్టీ ఉండాలి.
- ఆసుపత్రుల్లో మెట్లు విశాలంగా ఉండటంతోపాటు ర్యాంపులు ఉండాలి.
- రోగులను స్ట్రెచర్స్‌పై తీసుకెళ్లేందుకు వీలుగా ర్యాంపులుండాలి.
- ఇవేమీ పట్టించుకోకుండానే ఇరుకైన గదులను అద్దెకు తీసుకుని ఆస్పత్రులను ఏర్పాటు చేస్తున్నారు.

కన్పించని బోర్డులు

- ఆస్పత్రుల్లో వైద్యుల వివరాలు, వారి అర్హతలు, ఇతర సిబ్బంది వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలి. ఆసుపత్రిలో అందే సేవలు, వాటికి ఎంత ఫీజు కూడా ప్రకటించాలి. అలాగే సిబ్బందికి చట్ట ప్రకారం వేతనాలు చెల్లించడం లేదనే ఆరోపణలున్నాయి. కొన్ని ఆసుపత్రులు కాలుష్య నియంత్రణమండలి నుంచి అనుమతి కూడా తీసుకోవడం లేదని సమాచారం. కొన్ని ఆసుపత్రులు ఆటోమెటిక్ జనరేటర్లను రోడ్లపైనే ఏర్పాటు చేస్తున్నారు. కొందరు వైద్యులను రప్పిస్తూ.. ఒకసారి న్యూరోసర్జన్ అని, మరోసారి ఫిజిషియన్ అని వారి సేవలను వినియోగించుకుంటున్నారు.

అనుమతి తప్పనిసరి



కొత్తగా ఆస్పత్రులు ఏర్పాటు చేసినప్పుడు సంబంధిత డాక్టర్ ఎవరనే ముందుగానే తెలియజేయాలి. ఆస్పత్రికి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రుల్లో వైద్యులు మారితే మళ్లీ అనుమతి తీసుకోవాలి.

– పుప్పాల శ్రీధర్, డీఎంహెచ్‌వో

కన్పించని పార్కింగ్

- జిల్లాలో ఏ ఆస్పత్రిలోనూ పార్కింగ్ సౌకర్యం లేదు. రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్, జంబిగద్దె, గొల్లపల్లి రోడ్, మహాలక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో అత్యధికంగా ఆస్పత్రులున్నాయి. ఏ ఆస్పత్రిలోనూ పార్కింగ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఆస్పత్రికి పేషెంట్లను తీసుకువస్తే రోడ్లన్నీ బ్లాక్ కావాల్సిందే.

క్లుప్తంగా

21న కట్కాపూర్‌కు సెంట్రల్ కమిటీ సభ్యుల రాక


వివరాలు తెలుసుకుంటున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో

రాయికల్: మండలంలోని కట్కాపూర్ హెల్త్ సబ్‌సెంటర్‌ను క్వాస్ గుర్తింపు కోసం ఈనెల 21న సెంట్రల్ కమిటీ సభ్యులు పరిశీలించనున్నట్లు డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సబ్‌సెంటర్‌ను పరిశీలించారు. ఆస్పత్రి స్థితిగతులపై ఆరా తీశారు. టీబీ పరీక్షలు సరిగా ఉన్నాయా..?లేదా..? అని ఆరా తీశారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ సతీశ్ ఉన్నారు.

సంక్షేమ శాఖ అధికారిని కలిసిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ


భాస్కర్‌తో కమిటీ సభ్యులు

జగిత్యాల: జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్‌ను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. సమస్యల పరిష్కారంలో ముందంజలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీరామోజు ధనలక్ష్మీ, సభ్యులు కోట శివకుమార్, కోండ్ర రాజ్‌కుమార్, ఓటరికారి శ్రీనివాస్, నీలగిరి విజయలక్ష్మీ, డీసీపీవో హరీశ్ పాల్గొన్నారు.

తాట్లవాయిలో షార్ట్‌సర్క్యూట్


ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

రాయికల్: మండలంలోని తాట్లవాయికి చెందిన బుర్ర రమేశ్‌గౌడ్ ఇంట్లో బుధవారం షార్ట్ సర్క్యూట్ అయ్యింది. ఇంట్లోని వస్తువులు, బట్టలు, టీవీ, ఫ్రిజ్ కాలిపోయాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు రమేశ్ తెలిపారు. ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి సంఘటనస్థలానికి చేరుకుని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. నివేదిక అందించాలని ఒడ్డెలింగాపూర్ ట్రాన్స్‌కో ఏఈకి సూచించారు. ఆమె వెంట సర్పంచ్ రాగి సాగరిక, ఉపసర్పంచ్ ఆకుల మల్లేశం, గ్రామ అధ్యక్షుడు రంజిత్, యూత్ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు రాంచందర్‌రావు, వినోద్, మహిపాల్‌రెడ్డి, రాజేశం పాల్గొన్నారు.

అనారోగ్యంతో వివాహిత మృతి

కోరుట్లరూరల్: మండలంలోని అయిలాపూర్‌కు చెందిన వివాహిత నల్ల లోహిత (23) అనారోగ్యంతో మృతి చెందింది. ఎస్సై కిరణ్ కుమార్ కథనం ప్రకారం లోహితకు 4 నెలల క్రితం పాప పుట్టింది. అప్పటినుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం అనారోగ్యానికి గురికాగా.. ఆమె భర్త విశాల్ ఆసుపత్రికి తరలిస్తుండగానే చనిపోయింది. లోహిత తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'దళితబంధు'పై మహిళల ఆందోళన


నేరెల్లలో పంచాయతీ కార్యాలయం ముందు బైటాయించిన దళితులు


గ్రామ పంచాయతీని ముట్టడించిన దళిత మహిళలు

- నేరెల్లలో పంచాయతీ కార్యాలయం ముట్టడి
- రోడ్డుపై బైటాయించి నిరసన
- వెల్గటూర్‌లోనూ కదం తొక్కిన మహిళలు
- రామయ్యపల్లెలో ఇరువర్గాల వాగ్వాదం

ధర్మపురి: పేదలకు అందించాల్సిన దళితబంధు పథకాన్ని అర్హులకు కాకుండా.. అనర్హులకు అందిస్తున్నారని, ఇందులో గ్రామాల్లోని ప్రజాప్రతినిధులే చక్రం తిప్పుతున్నారని పేర్కొంటూ దళిత మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పథకంలో మండలంలోని రామయ్యపల్లె, నేరెల్ల, దమ్మన్నపేట, రాజారం గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీల తీరును నిరసిస్తూ.. ఆయా గ్రామాలకు చెందిన వందలాది మంది పంచాయతీ కార్యాలయాలను బుధవారం ముట్టడించారు. గ్రామాల్లో అర్హులు కనిపించడంలేదా..? అంటూ నిలదీశారు. ఒకే ఇంట్లో ఇద్దరికి ఇస్తున్నారని, భూములు, ఆర్థికంగా ఉన్న బీఆర్ఎస్ నాయకులను ఎంపిక చేసి తమకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామయ్యపల్లెలో 160 కుటుంబాలు ఉండగా ఏడు యూనిట్లు మంజూరు చేశారని, వారిలో ఏ ఒక్కరూ అర్హులు కాదని సర్పంచ్‌ను నిలదీశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ యువకుల మధ్య వాగ్వివాదం జరిగి ఒకరిపైఒకరు దాడులు చేసుకున్నారు. నేరెల్లలో సర్పంచ్, ఎంపీటీసీ కార్యాలయానికి రావాలని నినాదాలు చేశారు. గతంలో కారు, ట్రాక్టర్ మంజూరైన వారికే తిరిగి దళితబంధులో పేరు రావడమేంటని ప్రశ్నించారు. ఇక్కడ 200 కుటుంబాలు ఉండగా.. 17మందిని ఎంపిక చేశారు. ఇందులోనూ అర్హులు లేరని పేర్లు చదివి వినిపించారు. తమకు న్యాయం చేయాలంటూ గ్రామానికి చెందిన సుమారు వందమంది మంత్రి కొప్పుల ఈశ్వర్ వద్దకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దమ్మన్నపేట, రాజారం గ్రామాల్లో నిరసనలు తెలిపి ధర్మపురిలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు.

వెల్గటూర్‌లో..

వెల్గటూర్: మండలంలోని జగదేవుపేటలో దళిత బంధు, గృహలక్ష్మి లబ్ధిదారుల జాబితాలో అర్హులకు కాకుండా ఎంపీపీ, ఆయన బంధువులు, బీఆర్ఎస్ నాయకులకే కేటాయించారని పేర్కొంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలలు 9మందికి, మాదిగల్లో ముగ్గురికి మాత్రమే కేటాయించారని పేర్కొంటూ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. సర్పంచ్, ఎంపీపీ, అధికారులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి స్పందించి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలకు ఆర్‌ఎంపీ టోకరా..?

- 40 మందికి రూ.60 లక్షలు ఎగవేత
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు


పోలీస్‌స్టేషన్ వద్ద బాధిత మహిళలు

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో ఆర్‌ఎంపీగా పనిచేసిన ఓ వ్యక్తి అదే గ్రామానికి చెందిన సుమారు 40 మంది మహిళల నుంచి రూ.60 లక్షల మేరకు అప్పు తీసుకుని ఎగనామం పెట్టి పారిపోయాడు. జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన వ్యక్తి కల్లెడలో 13ఏళ్లుగా ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నాడు. అక్కడే ఇల్లు నిర్మించుకుని భూమి కొనుగోలు చేశాడు. ఈ క్రమంలో మహిళలు, వృద్ధుల నుంచి సుమారు రూ.60 లక్షల మేర అప్పు తీసుకున్నాడు. కొద్దిరోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా గ్రామంలోని ఇల్లు, భూమి విక్రయించి ఊరునుంచి వెళ్లిపోయాడు. బాధితులు కొద్దిరోజులుగా ఫోన్ చేస్తే డబ్బు చెల్లిస్తానని చెప్పాడు. వారం రోజులుగా సదరు వైద్యుడు కన్పించకపోవడంతో బాధితులు బుధవారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

'చల్మెడ'కు నామినేషన్ ఫీజు


చల్మెడకు నామినేషన్ ఫీజు అందిస్తున్న మహిళలు

కథలాపూర్: వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు నామినేషన్ ఫీజును మండలంలోని బొమ్మెన గ్రామానికి చెందిన మహిళలు అందించారు. బుధవారం కథలాపూర్‌లో ఓ కార్యక్రమానికి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరు కాగా మహిళలు పొదుపు చేసి దాచుకున్న రూ.10 వేలు అందించారు. ఆ డబ్బులను నామినేషన్‌కు వినియోగించాలని మహిళలు కోరారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

- కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌కు చెందిన బింగిసారపు నీలగిరి (51) ఈనెల 5న ఖతార్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని చూడగానే కుటుంబసభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. నీలగిరి 20 ఏళ్లుగా ఖతార్ వెళ్లి వస్తున్నాడు. రెండేళ్ల క్రితం సెలవుపై వచ్చి వెళ్లాడు. ఈనెల 5న ఆరోగ్యం క్షీణించగా తోటి కార్మికులు అక్కడి ఆసుపత్రిలో చేర్చారు. షుగర్ లెవల్స్ తగ్గడం.. అంతలోనే గుండెపోటు రావడంతో ఆసుపత్రిలోనే మృతి చెందాడు. నీలగిరికి కుమారుడు వంశీ, కూతురు ఉన్నారు. కూతురుకు పెళ్లయ్యింది. కుమారుడు ఉపాధి కోసం గల్ఫ్ దేశమైన అబుదాబి వెళ్లాడు. తండ్రి మృతితో వంశీ స్వగ్రామానికి చేరుకుని అంత్యక్రియలు పూర్తిచేశాడు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేందుకు తెలంగాణ గల్ఫ్ సమితి బృందం కృషి చేసింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అయిలాపూర్ వరకు ఉచితంగా అంబులెన్స్ సౌకర్యం కల్పించింది. తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మధు మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

రూ.25వేల మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

మల్యాల(చొప్పదండి): మల్యాల మండలంలోని మద్దుట్లలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న సంకూర్తి మల్లారెడ్డి ఇంట్లో బుధవారం పోలీసులు దాడి చేశారు. సుమారు రూ.25వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మల్లారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తీగల అశోక్ తెలిపారు.

రూ.6.60లక్షలు పట్టివేత


వివరాలు తెలుసుకుంటున్న సీఐ ప్రవీణ్‌కుమార్

కథలాపూర్(వేములవాడ): మండలంలోని కలిగోట శివారు పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.6.60 లక్షలు పట్టుబడ్డాయని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, కథలాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామానికి చెందిన గుర్రపు నరేశ్ తన కారులో డబ్బులు తీసుకెళ్తుంటే పట్టుకున్నామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు డబ్బులను సీజ్ చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు.

అనధికారిక నిర్మాణాల పరిశీలన


నిర్మాణాలు పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

కోరుట్ల: కోరుట్ల శివారు సంగెంరోడ్డులోని జంబిగద్దె సమీపంలో గుడిసెవాసులు అనధికారికంగా నిర్మించిన ఇళ్లను ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. అనుమతులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు సరికాదన్నారు. ఇళ్ల స్థలాల కోసం పేదల నుంచి సుమారు 4వేల దరఖాస్తులు వచ్చాయని, అర్హుల ఎంపికకు పరిశీలిస్తున్నామని, ఎన్నికల కోడ్ వచ్చినందున సదరు ప్రక్రియ నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. అప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలూ చేయొద్దని సూచించారు. వారి వెంట తహసీల్దార్ కిషన్ ఉన్నారు.

ఫ్లెక్సీలకు అనుమతి తప్పనిసరి


మాట్లాడుతున్న భీంకుమార్

జగిత్యాల: అనుమతి లేని ప్రచారసామగ్రి, ఫ్లెక్సీలు ప్రచురిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని డీపీఆర్‌వో, ఎంసీఎంసీ కార్యదర్శి ఎం.భీంకుమార్ అన్నారు. బుధవారం ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీషాపుల యజమానులతో సమావేశమయ్యారు. అభ్యర్థులు ప్రింటింగ్ చేయించే ప్రచార సామగ్రి, ఫ్లెక్సీలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుమతి పొందాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రింటింగ్‌ప్రెస్ పేరు, చిరునామా, సెల్‌నంబరు తప్పనిసరిగా ఉండాలన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు రామన్నపేట విద్యార్థిని


లిఖిత

మల్యాల: మల్యాల మండలంలోని రామన్నపేట జెడ్పీ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని బొగాని లిఖిత రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజగోవిందరెడ్డి, పీఈటీ విద్యాసాగర్ తెలిపారు. ఈనెల 4న కొడిమ్యాల మండలంలో నిర్వహించిన జిల్లాస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య ఖోఖో అండర్–17 విభాగంలో లిఖిత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 13న మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. లిఖిత పలువురు అభినందించారు.

ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడిగా రాజాగౌడ్


బత్తిని రాజాగౌడ్

మెట్‌పల్లిరూరల్: ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ యూఏఈ దుబాయి శాఖ అధ్యక్షుడిగా మెట్‌పల్లి మండలం వెల్లులకు చెందిన బత్తిని రాజాగౌడ్ నియమకం అయ్యారు. సంబంధిత ఉత్తర్వులను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల బుధవారం ఈ మెయిల్ ద్వారా రాజాగౌడ్‌కు పంపించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమంతోపాటు హక్కుల కోసం పోరాడాలని అందులో సూచించారు. యూనియన్ అంతర్జాతీయ స్థాయిలో భవన నిర్మాణ రంగం, వలస కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటంలో కీలకపాత్ర పోషిస్తుం

సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించాలి


సబ్సిడీపై పరికరాలు అందిస్తున్న డీన్

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులు పాటించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతి నారాయణభట్ అన్నారు. పొలాసలోని వ్యవసాయ కళాశాలలో సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా వివిధ పంటల్లో ఆచరించాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలపై బుధవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సబ్సిడీపై పరికరాలు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు ఒకే భూమిలో ఒకే పంట వేయకుండా పంటల మార్పిడి పాటించాలన్నారు. తద్వారా తెగుళ్లు, పురుగుల బెడద తక్కువగా ఉండి దిగుబడి పెరిగే అవకాశముందన్నారు. ప్రొఫెసర్లు రత్నాకర్, శ్రీనివాస్‌నాయక్ పాల్గొన్నారు.

ఈనెల 18న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు

జగిత్యాల: ఈనెల 18న మెట్‌పల్లి మినీస్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ముత్తయ్యరెడ్డి తెలిపారు. క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పేర్కొన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో సూర్యాపేట జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు ఉంటాయని, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఉషారెడ్డి పాల్గొంటారని తెలిపారు. కొమురయ్య, రాందాస్ పాల్గొన్నారు.

పది లీటర్ల మద్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హనుమాన్‌వాడలో బుర్ర రామకృష్ణ ఇంట్లో అక్రమంగా నిలువ చేసిన 10 లీటర్ల మద్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. రామకృష్ణపై కేసు నమోదు చేశామన్నారు.

ఓట్లు అడిగే అర్హత బీఆర్ఎస్‌కే ఉంది..


మాట్లాడుతున్న వినోద్‌కుమార్, చిత్రంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్(వేములవాడ): రాష్ట్రంలో ఓట్లు అడిగే అర్హత కేవలం బీఆర్ఎస్‌కే ఉందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహరావుతో కలిసి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే వైద్య కళాశాలలు పెరిగాయన్నారు. దీనిపై ఏ చర్చకైనా సిద్ధమేని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేస్తోందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని తెలిపారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక సూక్ష్మ ప్రణాళిక చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. ఒక్కసారి అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గడీల గంగప్రసాద్, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నల్లగొండ నుంచి చొప్పదండి ఎమ్మెల్యే ప్రచారం

- హాజరైన ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్


నల్లగొండలో ప్రచారం చేస్తున్న సుంకె రవిశంకర్, బోయినపల్లి వినోద్ కుమార్

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం నుంచి చొప్పదండి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ హాజరయ్యారు. రాష్ట్రంలో మైక్రో ప్లానింగ్ పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ పథకం ద్వారా ప్రతి ఒక్కరి అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలు అందేలా చూస్తామన్నారు. సుంకె రవిశంకర్‌ను భారీ మెజార్టీతో మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు. రైతు ఏ కారణంతో చనిపోయినా రూ.5లక్షల బీమా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కథ ముగిసింది

- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి.

జగిత్యాలటౌన్:రానున్న ఎన్నికలతో సీఎం కేసీఆర్ కథ ముగుస్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైన కేసీఆర్‌కు ఉద్వాసన పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కోడ్‌కు ముందు గృహలక్ష్మి, బీసీబంధు మంజూరు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జర్నలిస్టుల సంక్షేమ నిధి ఏర్పాటు చేసి అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన గ్యారెంటీ పథకాలను ప్రతి గడపకూ తీసుకెళ్లి అన్ని వర్గాల మద్దతుతో రాబోయే ఎన్నికలో విజయం సాధిస్తామన్నారు. సమావేశంలో నాయకులు గిరి నాగభూషణం, కొత్త మోహన్, బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, జున్ను రాజేందర్, మన్సూర్, నేహాల్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొప్పుల చేసిన అభివృద్ధి శూన్యం

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


పెగడపల్లి: దోమలకుంటలో కార్యకర్తలతో లక్ష్మణ్

పెగడపల్లి/బుగ్గారం: ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధి శూన్యమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. పెగడపల్లి మండలం దోమలకుంటలో బుధవారం ఇంటింటా కాంగ్రెస్ గ్యారంటీ పథకాలు ప్రచారం చేశారు. వివిధ పార్టీల నుంచి 100 మంది కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు. మంత్రి పీఏలు అధికారులను బదిలీ చేయిస్తూ రూ.లక్షలు దండుకుంటున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు బండారి శ్రీనివాస్, శ్రీనివాస్‌యాదవ్, అనిల్, ప్రవీణ్, రాజేందర్ పాల్గొన్నారు.

బుగ్గారంలో గడపగడపకూ కాంగ్రెస్

బుగ్గారంలో లక్ష్మణ్‌కుమార్ గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారాన్ని చేపట్టారు. ముందుగా పోచమ్మ ఆలయంలో పూజలు చేశారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాల్సి ఉండగా.. మంత్రి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని వేరేచోట నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి కొప్పుల ఎప్పుడూ పేదల గురించి ఆలోచించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొచ్చిన తర్వాత ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, నాయకులు నర్సాగౌడ్, తిరుపతి, నగునూరి శ్రీనివాస్, చిన్న నర్సాగౌడ్, కుమ్మరి రాజన్న పాల్గొన్నారు.

సూరమ్మ ప్రాజెక్టు పేరిట బీఆర్ఎస్ మోసం


తాండ్ర్యాలలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్(వేములవాడ): మండలంలోని కలిగోటలో సూరమ్మ ప్రాజెక్టును నిర్మించి 50వేల ఎకరాలకు నీరందిస్తామని హామీ ఇచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. బుధవారం తాండ్ర్యాల, గంభీర్‌పూర్, కలిగోటలో గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు తొమ్మిది రకాల నిత్యావసర వస్తువులను రేషన్ షాపుల ద్వారా అందించామని గుర్తు చేశారు. పేదలను విస్మరించిన బీఆర్ఎస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు నాగరాజు, అజీమ్, కల్లెడ గంగాధర్, కడారి శ్రీనివాస్, ఉరుమడ్ల చారీ, పులి హరిప్రసాద్, పంజాల మారుతి, జవ్వాజి చౌదరి, ఎగ్యారపు శ్రీహరి పాల్గొన్నారు.

అవినీతి పాలనకు చరమగీతం పాడుదాం


బొల్లెం చెరువులో ప్రచారం చేస్తున్న సత్యం

కొండగట్టు(చొప్పదండి): కమీషన్లు, కలెక్షన్ల కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్‌కు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండలం కొండాపూర్, బొల్లంచెరువు గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్ ప్రచారం చేశారు. పార్టీ అధికారంలోకొస్తే చేపట్టనున్న గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. పీసీసీ సభ్యుడు గోగూరి మహిపాల్‌రెడ్డి, నాయకులు చిలువేరి నారాయణగౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, గడ్డం జీవన్‌రెడ్డి, కడారి మల్లేశం, ముత్యం శంకర్, గాజుల అజయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూలను పూజించే సంస్కృతి మనది


బతుకమ్మలతో అధ్యాపక బృందం


బతుకమ్మ ఆడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

జగిత్యాల: ప్రకృతిలో లభించే పూలను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణదని, బతుకమ్మ పండుగే ఇందుకు నిదర్శనమని జిల్లాకేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ అన్నారు. కళాశాలలో మహిళ సాధికారత, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ సందర్భంగా ప్రతిఒక్కరూ పూలను పూజిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్సాహంతో బతుకమ్మ ఆడి అలరించారు. కార్యక్రమంలో స్వరూపరాణి, జ్యోతిలక్ష్మీ, పడాల తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, హర్జాత్‌కౌర్, జమున, వైస్ ప్రిన్సిపల్ సుల్తానా పాల్గొన్నారు.